అల్లుని అలక



విడిదిలో పెళ్ళికొడుకు అలిగి కూచున్నాడు.

మగపెళ్ళివారు భోజనాలకు రామని భీష్మించుకు కూర్చున్నారు.

పెళ్ళికొడుకు—తల్లి చీర చెంగుతో ముక్కు తుడుచుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నది మొహమంతా కందగడ్డ చేసుకుని. పక్కనే కూచున్న ఇద్దరు కూతుళ్ళు ఏవో చెప్పుతూ అగ్నికి ఆజ్యం పోస్తున్నారు.

ఉదయం పది-గంటల ఏడు నిముషాలకు మాత్రం ధారణ జరిగింది. ఆ తర్వాత ఆరంభ మయిందీ ప్రచ్ఛన్న యుద్ధం !

కన్యాదాత వెంకయ్యపంతులుగారు కాలు గాలిన పిల్లిలాగ తిరుగుతున్నారు పెళ్ళివారిని సమాధాన పరచాలని. అయిన ఖర్చు అవుతూ ఈ అల్లరి ఏమిటని ఆయన బాధ.

పెళ్ళి—పందిట్లో ఎవరో అన్నారుట .... "అందుకే సాంప్రదాయం చూసి చేసుకోవాలన్నారు. ఒక మంచీ మర్యాదా ఏమీలేదు. మొహం వాచినట్టు ఆ ఫలహారాలకు ఎగబడడ మేమిటి— తింటూ ఆ వంకలు పెట్టడమేమిటి" అని.

'ఆడ పెళ్ళివారు ఇలాంటి మాటలతో అవమానం చేస్తారా' అని, మగ పెళ్ళివారు అలిగారు.

వెంకయ్యపంతులుగా రసలే ముక్కోపి ! అయినా మనిషిలో ఎంతో మార్పు కనిపించిందా సమయంలో. ఎర్ర పట్టుబట్ట కట్టుకుని తెల్లటి జరీ అంచు పట్టు ఉత్తరీయం పైన వేసుకుని విడిదికి బయలుదేరుతుంటే 'అసలే ఈయనది దుడుకు స్వభావం; లేనిపోని గొడవలు చేసి రసాభాసం చేస్తాడేమో'నని వెంట ఆయన తోడల్లుడు సుందర్రామయ్య కూడ వెళ్ళాడు.

వెంకయ్య పంతులుగారు నవ్వుముఖంతో ప్రాధేయపూర్వకంగా వియ్యంకుడి చేతులు పట్టుకుని బ్రతిమలాడారు.' 'ఎవరో ఏదో అన్నారని ఇలా భోజనాలు చెయ్యకుండా ఉండటం న్యాయమా చెప్పండి బావగారూ ! మేముగా ఏమయినా తెలియక పొరపాటున చేసి ఉంటే చెప్పండి; క్షమాపణ వేడుకుంటాను.'

ఆయనంటున్న మాటలకు లోపలినుంచి వియ్యపురాలి పక్కన కూచున్న బంధువు దగ్గర మంచి సమాధానం వచ్చింది.

'ఎవరో ఏదో అంటే మా కెందు కింత బాధ ! పెళ్ళికూతురికి స్వయాన అమ్మమ్మట ఆ మాటలన్నది. మేమేమీ తిండికి మొహంవాచి రాలేదు మా మంచీ మర్యాదా మీచేత పరీక్ష చేయించుకోటానికి రాలేదు !'

'ఆవిడ పెద్దది. తొందరలో ఏదో అని ఉంటుంది. ఆమె మాటలు అంతగా పట్టించుకోవాల్సిన పనిలేదు. ఇక భోజనాలకు లేవండి బావగారూ ! 'విస్తళ్ళు వేశారు. వడ్డించడానికి సిద్ధంగా ఉన్నారక్కడ. మీరు లేవాలి ఇక.' వెంకయ్య పంతులుగారు ప్రాధేయపడ్డారు.

వెంట వచ్చిన సుందర్రామయ్యకు తను ఎన్నడూ చూడని సౌమ్యత ఆయనలో చూస్తుంటే ఆశ్చర్యం వేసింది.

'అనే మాటలు అనేసి— తొందరలో అన్నది— పెద్దది— అంటే ఎలాగండీ, మా కెంత కష్టంగా ఉందో ఆలోచించారా మరి!' వరండాలో స్తంభానికి ఆనుకుని కూచుని పుగాకు చుట్ట చుట్టుకుంటున్న ఒక బంధువు ఎదురుప్రశ్న వేశాడు.

ఆ విడిదిలో ఉన్నవాళ్ళు మూడు వంతులకు పైగా ఉదయం ఏడుగంటలనుండీ అప్పటిదాకా ఆడపెళ్ళివారికి కబుర్లమీద కబుర్లు పెట్టి తెప్పించుకున్న ఇడ్లీ — ఉప్మా, కాఫీ నాలుగైదు సార్లయినా ఖాళీ చేశారు.

ఇదంతా చూసి ఆ ముసలావిడకు వళ్ళుమండిపోయి, ఆ మాట అన్నది, అయిదోసారి కాఫీ గుండిగ పట్టించుకు పోదామని వచ్చిన ఆమె వినేట్లుగా!

విడిదింట్లో ఒకవేపుగా మంచంమీద కూచుని స్నేహితులతో ముచ్చట్లాడుతున్నాడు పెళ్ళికొడుకు.

'రేడియో అడగరా మీ మామను.'

'రేడియోకంటె— ట్రాన్సిస్టరడగరా ఇప్పుడు గాకపోతే ఇంకెప్పుడిస్తాడు?' అని సలహాలిస్తున్నారు మిత్రులు.

'ఆయన్ని మనవేపు రానీ అసలు' పెళ్ళికొడుకు సందేహం వెళ్ళబుచ్చాడు.

'ఓరి చవటా! అప్పుడే నీళ్ళుగారి పోతావేమిరా! ఆయన వచ్చి 'లేవోయ్ భోజనానికి' అని అనగానే లేచి ఆయన వెంట పరిగెత్తక. కొంచెం బెట్టుచెయ్యి. మిగత సంగతి మేము పూర్తి చేస్తాము అని ధైర్యం చెప్పారు మిత్రులు. పెళ్ళికొడుకు అంగీకార సూచకంగా బుర్ర ఊపాడే గాని తన వయిపువాళ్ళు ఒక పట్టాన తెగనిచ్చేటట్టు కనబడలేదు వ్యవహారం.'

మామగారు ఒంటరిగాడయిపోయినాడు. ఆయన బతిమలాడుతున్న కొద్దీ, తీరుబడిగా కూచుని విజృంభిస్తున్నారు ఎవరికి తోచినట్లు వాళ్ళు.

వెంకయ్య పంతులుగారు క్షణక్షణానికి సహనం కోల్పోతున్నారు. అయినా తప్పదు! ఇటువంటి సమయాల్లోనే ఓర్పు, నేర్పు అవసరం! ఇదే తను తలపెట్టిన శుభకార్యం! అంతా సవ్యంగా జరిగిపోయిందనుకుంటే, సరీగా భోజనాల ముందు పేచీ వచ్చిపడింది. అసలు వాళ్ళని మాట్లాడనివ్వకుండ పక్కలన ఉన్నవాళ్ళు తలా ఒక మాట విసురుతున్నారు. వియ్యంకుడు ఎటూ చెప్పలేక గుంజాటన పడుతున్నాడు.

పెళ్ళి చేసిచూడు; ఇల్లు కట్టిచూడు అన్నారందుకే! వేలకువేలు డబ్బు ఖర్చయినా వచ్చే మాట రానేవస్తుంది. వెంకయ్య పంతులుగారి వివాహంలో తనవాళ్ళు ఇంతకన్న ఎక్కువ అల్లరే చేశారు. పాపం! ఆయన మామగారు ఆరితేరిన అనుభవజ్ఞుడు కావడంచేత అన్నీ సునాయాసంగా సమర్థించుకుపోయాడు. ప్రతిదానికి అడుగడుగునా వంకలు పెట్టటమే మగపెళ్ళివారు. అప్పుడు జరిగిన దానికంటే ఇప్పటి పరిస్థితిలో ఎన్నోరెట్లు నయం! ఆ విషయం జ్ఞాపకంవచ్చి ఆయన కోపాన్నంతా దిగమింగుకుని వియ్యంకుడిని, ఆయన బంధులవును సమాధాన పరచాలని శతవిధాల ప్రయత్నం చేస్తున్నారు.

ఒక అరగంట జరిగింది వరసన. ఎంత సేపయినా, మళ్ళీ మొదటికే వస్తున్న దీ వ్యవహారం! భోజనాలకు లేచే వాతావరణం ఎక్కడా కనిపించలేదు. ఆలస్యం జరుగుతున్నకొద్దీ విడిదిలో ఏం జరుగుతున్నదో తెలుసుకుందామని పెళ్ళివారింటి నుంచి ఒకరి తర్వాత ఒకరు చేరుకుంటున్నారు.

'సరే మీరంత పట్టుదల వడితే ఏం చెయ్యగలను చెప్పండి. నేనూ ఇక్కడే కూచుంటాను' అని వెంకయ్య పంతులుగారు వియ్యంకుడి పక్కనే కూచున్నారు.

ఆయన తోడల్లుడు సుందర్రామయ్యకు మాత్రం సహనం నశించి అరికాలిమంట నెత్తికెక్కింది. 'వీళ్ళు మనుషులా లేక కారణ జన్ములయిన రాక్షసులా' అనిపించిందాయనకు.

వెంకయ్యపంతులుగారు కూచోవడం గమనించిన ఒక బంధువు 'మీరు అనే మాటలు బాగానే ఉన్నాయి గానీండి; తప్పంతా మాదే నంటారు ఇంతకీ!' అన్నాడు అయిదోసారి పుచ్చుకున్న కాఫీ టిఫీను పీకదాకా ఎగదన్నుతుంటే తాపీగా కంఠం సరిజేసుకుంటూ.

ఇంక లాభం లేదనుకున్నాడు సుందర్రామయ్య. కూచున్న వాడల్లా దిగ్గున లేచి 'అన్నమాటలేవో అన్నాము. కావాలని మేమే ఆ ముసలమ్మచేత అనిపించాము. సరా!.... ఇప్పుడు మీరు భోజనాలకు లేస్తారా లేవరా! ఒక్కటే మాట. రెండు నిముషాలే టయిము' అన్నాడు హెచ్చు—స్వరంతో.

ఆయన ముఖ కవళికలు చూసి అక్కడ జేరిన అందరూ హడలిపోయారు. అప్పటిదాకా ఒకళ్ళ కొకళ్ళు సంబంధం లేకుండా మాట్లాడుకుంటున్న మాటలతో రణగొణ ధ్వనిగా ఉన్న విడిది నిశ్శబ్దంగా అయిపోయింది.

ఆడవాళ్ళంతా గజగజలాడారు. పెళ్ళికొడుకు గుండెల్లో రాయిపడింది. వెంకయ్య పంతులుగారు పరిస్థితి అర్థం చేసుకుని నవ్వుతూనే తోడల్లుని సమీపించి 'తొందరపడకు తమ్ముడూ!' అన్నారు.

'మీరూరుకోండి అన్నగారూ! క్షమించండి. అంతకంటె ఏమీ చెప్పలేను!' అని కోపంతో ఊగిపోతూ వెంకయ్యపంతులుగార్ని తప్పించుకుని రెండడుగులు ముందుకు వేసి 'అందరి మర్యాదా మంట కలసిపోకముందే — భోజనాలకు నడవండి— ఏమండి వియ్యంకుడుగారూ చూస్తారేం?.... ఒరేయ్ చెంచయ్యా! భజంత్రీలను రమ్మను— మేళం చెయ్యమను...' ఆజ్ఞలు జారీచేశాడు సుందర్రామయ్య.

'లేవలేకపోతే ఏం జేస్తాడో!' అని ఒకమూల నుంచి అన్న మాటలు ఆయన చెవుల్లో పడ్డాయి.

'నేనేం చేస్తానో, చేయిస్తానో మీతో చెప్పి చేయవలసిన అవసరం నా కేమీలేదు. మూర్ఖంగా ప్రవర్తించక హృదయమున్న మనుష్యులుగా ప్రవర్తించండి!' గర్జించాడు.

ఇంతలో చెంచయ్య అందించిన సందేశం ప్రకారం బాజా భజంత్రీలు వచ్చి విడిదిముందు నిలిచారు.

ఆశ్చర్య మేమిటంటే వెంకయ్య పంతులుగారు కూడ తన తోడల్లుని వేపు చూడడానికి సాహసించలేకపోయారు. అప్పటిదాకా కుడితిలో పడిన ఎలుకలాగా కొట్టుకుంటున్న వియ్యంకుడు లేచి లోపలికి వెళ్ళి 'నే చెబితే విన్నారుటమ్మా!.... సవ్యంగా సాగిపోతున్న దానికి ఒక అడ్డుపుల్ల వేస్తిరి. ఇప్పుడు అవమానం—పాలయ్యేది వాళ్ళా మనమా! అసలే పల్లెటూరు ఇది. పదిమందిని పిలిచి మనమీదకు ఉసిగొలిపితే ఇక్కడ మన పరువేంకావాలి!.... ఆయన చూడు— వీరభద్రుడి అవతారం ఎత్తాడు!'' అని మొత్తుకున్నాడు. దానితో ఎవరి మటుకు వాళ్ళు తెలివి తెచ్చుకుని లేనిపోనిది భలానా వాళ్ళ పెళ్ళికి వెళ్ళి చావు దెబ్బలు తిని వచ్చారంటూ — కలగబోయే అపనిందకు జంకి— భోజనాలకు వెళ్ళడానికి సిద్ధపడ్డారు.

సుందర్రామయ్య విడిదంతా కలియ చూశాడు. అందరూ లేచి సిద్ధ మవుతున్నారు గాని పెళ్ళికొడుకు మాత్రం నడిమంచంమీద కూచున్నాడు తిష్ఠ వేసుకుని.

'ఏం మిష్టర్! లే! లే! వాళ్ళంతా బయలుదేరారు. ఇప్పటికే కాలాతీత మయిపోయింది' అన్నాడు సుందర్రామయ్య పెళ్ళికొడుకు దగ్గరకు వెళ్ళి.

ప్రళయం సరాసరి తనమీదికే వచ్చినందుకు ఆలోచించే వ్యవధికూడ దొరక్క లేచీమని లేచి నుంచున్నాడు పెళ్ళికొడుకు పక్కనున్న స్నేహితులు నొక్కిపెడుతున్నా వినకుండా; వూడిపోతున్న మధుపర్కం సరిజేసుకుంటూ: 'అబ్బే నాదేముందీ, పదండి' అన్నాడు.

అందరినీ కూడగట్టుకుని పెళ్ళివారింటికి చేరేలోగా ఈ వార్త పాక్కిపోయింది పెళ్ళి పందిట్లో. సుందర్రామయ్య అంతపని చెయ్యగలిగాడా! అనేదే ప్రతివారిని ఆశ్చర్యపరచిన విషయం.

భయంతో భోజనాలకు బయలుదేరారే గాని మగ పెళ్ళివారి కిది అవమానకరంగానే తోచింది. పౌరుషం పెరిగింది. భోజనాల దగ్గర గొడవ చేసి ప్రతీకారం తీర్చుకోవాలని ఎవరి మటుకు వారు నిశ్చయించుకున్నారు. కొంతమంది బయటికే అనుకున్నారు. అవి మెల్లిగా పాకి మగపెళ్ళివారి కంటె ముందుగానే వెంకయ్యపంతులుగారింటికి చేరినయి.

ముహూర్త బలం మంచిది కాదన్నారు.

అంతా సవ్యంగా అయిపోయిందని సంతోషిస్తుంటే, ఆఖర్న ఈ కొసరు ఏమిటని బాధ వ్యక్తం చేశారు.

సాంప్రదాయం అవీ చూడకుండ సంబంధం కలిపితే ఇట్లాగే ఉంటుందని వ్యాఖ్యానించారు కొందరు.

'ఇటువంటి వాళ్ళతో ఎట్లా నెగ్గుకు వస్తుందో పాపం జానకి!' అని పెళ్ళికుమార్తె మీద సానుభూతి చూపించారు.

సుందర్రామయ్య ఇంట్లో వాళ్ళందరికీ ధైర్యం చెప్పాడు: 'మీరేం భయపడద్దు మీ పని మీరు కానివ్వండి' అన్నాడు.

వెంకయ్యపంతులుగారు మాత్రం ''లేనిపోని గొడవ ఏమిటిది సుందర్రామయ్యా!'' అని చేతులు పట్టుకున్నాడు ఎటూ పాలుపోక.

'మీరేం భయపడకండి. అంతా సవ్యంగానే జరిగిపోయేట్లు చూచే భారం నాది' అన్నాడు సుందర్రామయ్య.

అల్లరి చేద్దామనుకున్న వాళ్ళెవరూ నోరెత్త లేదు భోజనాల దగ్గర. దానికి కారణం సుందర్రా

43—వ పేజీ చూడండి

అల్లుని అలక...

13— వ పేజీ తరువాయి

మెయ్యి అడుగడుగునా ప్రత్యక్షమవుతుండటమే.

అంతా సక్రమంగానే జరిగిపోయింది గాని, పెళ్లి కొడుకు కోరికే ఇంకా కొరవ ఉండిపోయింది. స్నేహితులు, అప్పచెల్లెళ్ళూ కాకుల్లా పొడవటం మొదలుపెట్టారు పెళ్ళికొడుకు రామారావును.

"వాళ్ళు అన్నమాటలకే తలవంపులుగా ఉంటే, నువ్వు చవటలాగ ఇలా వూరుకోవటం ఏమీ బాగాలేదు. ఫలానావాడి పెళ్ళికి వెళ్ళి, అవమానం పాలయి వచ్చామని మేము ఏ మొహం పెట్టుకుని చెప్పుకోము.' ఇట్లా రామారావు చెవిని ఇల్లు గట్టుకుని పోరారు.

'ఏమయినా సరే, అలక—పానుపుమీద విలువయిన వస్తువేదయినా కోరాల్సిందే !' అని రూలింగు ఇచ్చారు.

సాయంత్రం అయిదు గంటలయింది.

ఆడపెళ్ళివారు ఘనంగా అయిదు వందల రూపాయలు ఖర్చుపెట్టి రకరకాలుగా అలంకరించిన కారు మాట్లాడారు ఊరేగింపుకు; ఫుల్ బ్యాండు పెట్టుకూడా ఏర్పాటు చేశారు.

కాని, పెళ్ళికొడుకు అలిగాడు ! ఆరు గంట లయినా, పెళ్ళికొడుకు పట్టె మంచంమీద భైటా యింపు సమ్మె చేస్తున్నాడు !

వెంకయ్య పంతులుగారు తలపెట్టినది ఇదే మొదటి శుభకార్యం. జానకి ఆయన ప్రథమ సంతానం. కలిగినంతలో గొప్ప సంబంధం తెచ్చి చెయ్యాలని రెండు సంవత్సరాలపాటు గాలించి ఆఖరికి ఈ సంబంధం స్థిరపరుచుకున్నారు అన్ని విధాలా నచ్చటంచేత.

అల్లుడు డిగ్రీ పుచ్చుకున్నవాడనీ, కొద్దిపాటి ఆస్తి అదీ ఉన్నది, అత్తమామలు ఉన్న కుటుంబం గనుక అమ్మాయి సుఖపడుతుందనడంలో సందేహం లేదనీ వెంకయ్య పంతులుగారు విశ్వయించు కుని ముందుగా నిర్ణయించుకున్న లోపాయికారి కట్నం లో అయిదు వేల రూపాయలు లగ్నాలు పెట్టుకున్నప్పుడే ఇచ్చేశారు. అదిగాక ఆడబడుచుల లాంఛనాలకింద వెయ్యి రూపాయలు, పెళ్ళి కుమారుడికి వెండికంచం — పట్టు బట్టలకు బదులు సూటు, రిస్టువాచీ వగైరాలు లగ్న మప్పుడు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. అనుకున్న ప్రకారం అన్నీ సక్రమంగా జరిపారు.

ఇంత ఖర్చు భరించడానికి ఆయన సంతోషంతో ఒప్పుకోడానికి కారణం ప్రథమ సంతాన మయిన జానకి — వివాహం ఘనంగా జరిపించాలని సంకల్పించడమే ! అప్పటికే నాలుగు వేలు అప్పు తగిలింది ఆయనకు.

అల్లుడు అలిగాడనగానే వెంకయ్యపంతులు గారు పరిగెత్తుకుంటూ వెళ్ళారు పట్టు ఉత్తరీయం సరిజేసుకుంటూ.

'ఏం నాయనా ! ఏమిటి సంగతి' అని నవ్వు తూనే అడిగారు.

మానౌ—తడిలేక కళ్ళ మీదకు పడుతున్న జుట్టును చేత్తో పైకి నెట్టడానికి వృధా ప్రయత్నం చేస్తూ ముఖం చిట్లించి కోపం నటించాడు రామారావు, చేతికున్న కొత్త రిస్టువాచీకి ఉత్తుత్తి 'కీ' ఇచ్చాడు కాసేపు.

ఏదెటూ చెప్పలేడని గ్రహించిన పక్కనున్న స్నేహితుడు 'వాడు అలిగాడండీ ! అడగటానికి మొహమాటపడుతున్నాడు' అన్నాడు.

'అనుకున్న ప్రకారం అన్నీ ఇచ్చాను గదుటోయ్! ఇంకా ఏమిటి !.... అవతల ఊరేగింపుకు టయిము అయిపోతున్నది' అన్నారు పంతులుగారు బతిమాలు తున్న ధోరణిలో.

ఉదయమే, ఆడబడుచు కట్నంలో తన వాటాకు వచ్చిన రెండువందలూ పుచ్చుకుని పెట్టెలో దాచుకున్న పెళ్ళికొడుకు— అప్పగారు "వేడుకలన్నీ జరిపి తీరాల్సిందే ! అదేమన్నమాటండోయ్ !" ఇవ్వాళ కాకపోతే ఇంకెప్పుడు చెల్లుతయి వాడి ముచ్చట్లు మాత్రం ! ఈ కాస్త అయిపోతే ఆ తర్వాత మీరేం పెడతారో, వాడేం తీసుకుటాండో మే మేమన్నా చూడొచ్చామా 'అడగొచ్చామా' అన్నది తమ్ముడికి వత్తాసిగా.

భళిభళి అన్నారు ఇంకో ఇద్దరు ఆమె అన్న దానికి.

కుడితిలో పడిన ఎలుకలాగ అయింది వెంకయ్య పంతులుగారి పని. చుట్టూ ఆడవాళ్ళ మెజారిటీయే ఎక్కువగా ఉంది. అప్పటికే ఖర్చులన్నీ కలిసి తలకు మోపెడయినయి. ఇంకా ఇంకా ఒక దాని కొకటి ఇట్లా పెరిగిపోతుంటే ఎట్లాగని ఆలోచిస్తున్న ఆయన చెవులకు 'అడగరా ! మళ్ళీ అవతల ఊరేగింపుకు వేళవుతున్నదని సుందర్రామయ్యగారొచ్చి బెదిరిస్తే మళ్ళీ కష్టం' అన్న మాటలు వినిపించినయి.

'ఏమడగనూ నా మొహం ' అని జుట్టు పైకి నెట్టుకుని 'స్కూటరు' అన్నాడు రామారావు.

వెంకయ్య పంతులుగారు నీళ్ళు గారిపోయారు. రెండువేల అయిదు వందల రూపాయలు ఆయన కళ్ళముందు మెదిలినయి పసిపిల్లవాడు కారు కొనిపెట్టమన్నట్టుగా ఉన్నది అల్లుడు 'స్కూటరు' కొనిపెట్ట మనటం ! అతనేమంత అజ్ఞాని! తెలివి తక్కువ వాడా! అన్నీ తెలిసే అట్లా అడుగుతున్నాడు. ఆయనకు చాలా బాధ కలిగింది. వయిగా వియ్యపు రాలు, వియ్యంకుడు తమ కివేమీ పట్టనట్టు కొంచెం దూరంగా కూచున్నారు వేడుక చూస్తూ.

రాని నవ్వును బలవంతాన తెచ్చిపెట్టుకుని 'చూడు రామారావ్ ! కష్ట సుఖాలు తెలిసినవాడివి; చదువుకున్నవాడివి. అందుచేత దాపరికం లేకుండా చెబుతున్నాను. 'స్కూటరు' అంటే వందా రెండు వందలకూ వచ్చే వస్తువేమీకాదు. అంత పెద్దగా కోరటం బాగాలేదు. ఏదో నాకు తోచింది నేను సంతోషంగా ఇస్తాను తీసుకో !' అని వంద రూపాయల నోటు ఇవ్వబోయారు పంతులుగారు.

కళ్ళమీద పడిన జుట్టులోంచి వందరూపాయల నోటువేపు చూసి తటపటాయించాడు రామారావు, 'టు బీ ఆర్ నాట్ టు బి' అనే ముక్క జ్ఞాపకం వచ్చి.

'బాగుందిరోయ్ వరస— చావుకు పెడితే లంకణాని కన్నట్టు — ఇదేమిటి!' అన్నా డొక మిత్రుడు టూత్‌పేస్టు అడ్వర్టయిజ్ మెంటులాగ పళ్ళన్నీ వెళ్ళబెట్టి. ఇవేమీ వినిపించుకో కుండ, పంతులుగారు అల్లుడిని సమాధాన పరచ డానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ విషయం చల్లగా పాకింది పెళ్ళింటికి. తండిరి తల్లదపంలో విశ్రాంతిగా పడుకుని

క్యా లెం డ ర్లు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలకు క్యాలెండరు మాన్యుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము. మంచి కమీషన్‌పై పని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి :

AJANTA ART CALENDAR Mfg. Co

P. B. 255, MADRAS—1.

Swastik

ఇప్పుడు!

విశా ప్రియమైన

లోమ

(పౌడర్ రూపంలో)

ట్యూబ్

ప్యాకింగ్‌లోకూడా లభించుచున్నది



● చిండి పోదు

● పొడు పోదు

● పగిలి పోదు.

కొద్ది జిగటగంది గనుక వనితలకు కూడా మంచిదే

సోల్ ఏజెంట్లు మరియు ఎగుమతి దార్లు:
ఎమ్.ఎమ్. అంభట్‌వాలా, అహమదాబాద్.1
ఏజెంట్లు:
వి. నరోత్తమ్ అండ్ కొ., బొంబాయి-2

మా స్టాకిస్టులు:
మెసర్స్ జె. బలభాయ్ అండ్ కంపెనీ
260, చైనాబజార్, మదరాసు

బహుమతి – లోమ పెద్ద బాటిల్ లేక లోమ పౌడర్ ట్యూబ్ (స్టాకు ఉన్నంత వరకు) కొనిన ఒక కోహినూర్ అగర్ బత్తి పెట్టె ఉచితముగా యివ్వబడును.

ఆడవాళ్ళతో సరదాగా మాట్లాడుతున్న సుంద్రరామయ్య గుర్రుమన్నాడు. 'వీళ్ళు మనుషులా రాక్షసులా ! అడిగినంత కట్నమిచ్చి, సలక్షణ మయిన పిల్లనిచ్చి అన్ని లాంఛనాలతో పెళ్ళి చేస్తే ఇంకా గొంతెమ్మ కోరికలకు అంతెక్కడ !' అని చిందులెయ్యడం మొదలుపెట్టాడు.

మాతన వధువు జానకికి కళ్ళ నీళ్ళ పర్యంత మయింది. ఇంత హృదయంలేని మనుషులు కూడ ఉంటారా లోకంలో, అనుకుంది. తన తండ్రి ఎంత సరదా పడుతున్నాడో, అంత కించ పరుస్తు న్నారు పెళ్ళివారు వచ్చిన దగ్గర నుంచీ కోరికలకు కూడ మితముండాలి ! ఇష్టంవచ్చినట్టు 'నాకు రైలు కావాలి, విమానం కావాలి' అంటే, ఎక్కడి మంచి తేగలరు ఎవరు మటుకు ! జానకిని మూగ బాధ ఆవరించింది. ఎంతో మధురమయినదిగా ఊహించుకున్న వివాహం ఇంత జుగుప్సాకరంగా ఉంటుందనుకోని జానకి బాధపడింది.

సుంద్రరామయ్య లేచి విడిదికి వెళ్ళబోతుంటే జానకి భయపడింది. 'బాబాయ్ ! ఒక్కమాట' అని పిలిచి గదిలో నుంచి ఇవతలకువచ్చి, సుంద్రరా మయ్య దూకుడుగా వెళ్ళబోతున్న వాడల్లా వెనక్కు తిరిగి జానకి దగ్గరికి వెళ్ళి "ఏంమ్మా !" అన్నాడు. జానకి మొహం చిన్నబోయి ఉన్నది.

'అంతా విన్నాను బాబాయి ! ఇటువంటి మను ష్యులనుకోలేదు! ఇప్పుడు నువ్వు వెళ్ళి నోరు చేసు కుంటే, అల్లరి అవటం తప్ప మరేంలేదు' అని కాసేపు తటపటాయించి 'ఇదిగో బాబాయ్ ఎవరికీ తెలికుండ ఈ కాగితం వారికి అందజేయి. ఇదే విన్నుకోరేది' అన్నది జానకి కాగితం మడత ఆయన

అల్లుని అలక

చేతుల్లో పెడుతూ.

సుంద్రరామయ్య ఆ కాగితం అందుకున్నాడు, ఆయనలో రేగిన కోపం చల్లారింది. ముఖం ప్రశాంత మయింది.' 'అలాగే తల్లీ !' అని జానకి-తల నిమిరి విడిదివేపు దారితీశాడు.

ఈయన్ని చూస్తూనే అలక పాన్పున లంక రించిన పెళ్ళికొడుకు—చుట్టూ చేరిన సగంమంది జారుకున్నారు మెల్లిగా ఇవ్వేమీ పట్టించుకో కుండా, 'ఏమిటి' మామా— అల్లుడు మంతనా లాడుతున్నారు తీరిగ్గా' అన్నాడు సుంద్రరామయ్య అతి ప్రశాంతంగా— నవ్వుతూ.

'అబ్బే ఏముంది !.... అల్లుడు ఏదో వేడుక కొద్ది కోరాడు. ఆ విషయంమీదే మాట్లాడు తున్నాం !' అన్నారు వెంకయ్య పంతులుగారు నుదిటి మీద పట్టిన చెమట తుడుచుకుంటూ. అప్పటికే ఆయన సహనం చచ్చిపోయింది.

సుంద్రరామయ్య నవ్వుతూ పెళ్ళికొడుకు పక్కగా మంచంమీద కూచున్నాడు. లోపల పీచుపీచుమంటున్నా, పయికి బింకంగానే కూచు న్నాడు రామారావు.

మంచంచుట్టూ జేరిన అందరి మొహాలూ సావధానంగా చూసి, సుంద్రరామయ్య పెళ్ళికొడుకు చెవులో రెండు మాటలు రహస్యంగా చెప్పి, కాగితం మడత అతని చేతుల్లో ఉంచాడు.

పెళ్ళికొడుకు రెండు క్షణాలు చలనం లేకుండ అట్లాగే కూర్చుని మంచంమీద నుంచి దిగి 'ఇప్పుడే వస్తానురా' అని మిత్రులకు సంజ్ఞచేసి, బాత్ రూమ్‌లోకి వెళ్ళి కాగితం మడత విప్పి చదువు కున్నాడు. ఆ వెంటనే 'ఛీ ఛీ' ! అనుకున్నాడు పశ్చాత్తాప పడ్డాడు. చేదుమందు మింగినవాడిలా మొహంపెట్టి, ఆ కాగితం అతి భద్రంగా దాచు కున్నాడు.' ఎంత తప్పుపని చేశాను' అనుకున్నాడు.

సబ్బుతో కసాబిసా మొహమంతా రుద్దు కున్నాడు. గదిలోకి వెళ్ళి రెండు నిముషాల్లో డ్రస్ చేసుకుని వూరేగింపుకు సిద్ధమయి బయటికి వచ్చిన పెళ్ళికొడుకుని చూసి సుంద్రరామయ్య మినహా అందరూ ఆశ్చర్యపోయారు.

'అప్పుడే అలక తీరిందా ఏమిట్రా' అన్నారు మిత్రులు.

'ఆ ! తీరినట్టే !' అన్నాడు ముక్తసరిగా, అలంకరించిఉన్న కారువేపు నడుస్తూ.

వెంకయ్యపంతులుగారు అయోమయంగా తోడల్లుని వేపు చూశారు. 'అదంతా ఉందిలేండి అన్నగారూ' అని నిండుగా నవ్వాడు సుంద్రరా మయ్య.

అప్పుడే విడుదలయిన కొత్త సినిమాలో పాట అందుకున్నారు బ్యాండువాళ్ళు.

ఊరేగింపు—కారు బయలుదేరుతున్నదన్నారు అందరూ సంబర—పడిపోయి. పెళ్ళికూతురు సిగ్గు దొంతరలతో హంసలా నడిచివచ్చి కారులో కూర్చుంది తన హృదయేశ్వరుని పక్కన— హృదయమంతా మల్లెపందిరి కాగా.

పెళ్ళికొడుకులో హఠాత్తుగా ఇంత మార్పు రావటానికి కారణం ఏమిటో ఎంత తల బద్దలు కొట్టుకున్నా, అర్థం కాలేదు ఎవరికీ. ★